కథ

# ఆసరా

## శీతంరాజు చిట్టిబాబు

"డిన్నరు బాగుంది. థ్యాంక్సు! నేనింక బయలుదేరుతా, ట్రయినుకు టైమవుతోంది కూడా", అన్నాడు వేణు చిరునవ్వుతో తన బ్రీఫ్ కేసు తీసుకుంటూ...

"అదక్కడ పెట్టి కూర్చో. అంత హడావుడేమిటి?. రేపు వెళ్ళచ్చులే. నీ సలహాలెన్నో తీసుకోవాలి" అంది లీల.

"అవేవో నిన్ననే తీసుకుంటే బాగుండేదిగా? నాకు చాలా పనులున్నాయి, వుండటం కుదరదు", అన్నాడు వేణు ఖంగారుగా.

పదేళ్ళకు మళ్ళీ నిన్న కనిపించావు. చదువవగానే వో రెండేళ్ళుగావును, అన్నయ్యా, నువ్వు ఉత్తరాలు వ్రాసుకొనే వాళ్ళు. తరువాత ఉద్యోగాలు, సంసారాలు, బాధ్యతలతో అవీ ఆగిపోయినై. నిన్ననే, అన్నయ్య పోయిన సంగతి నీకు నేను, నీ భార్య పోయిన సంగతి నాకు నువ్వు చెప్పుకోవటం, ఓదార్పులతో బాధగా గడిచింది. ఏ సంగతులన్నా మాట్లాడింది యెక్కడ? పైగా ఊళ్ళో ఉన్న నలుగురు స్నేహితుల్నీ కూడా, నిన్న, యివాళ కలవాలంటూ హడావుడిగా వెళ్ళావు. ఇవాళ రాత్రికి డిన్నరుకు వచ్చి తీరాల్సిందే అంటే వచ్చావు, సంతోషం" అంది లీల.

"నీవోధనాశలేని డాక్టరువి. ఇంటి దగ్గిరే లిమిట్ చేసుకున్న ప్రాక్టీస్. అన్నీ సర్దుకు పోగలనేర్పరివి. నేనో, మరి ఉత్తరాదిని ఉద్యోగం మానేసి, మా ఊళ్ళోనే లా ప్రాక్టీస్ చేసుకుందామని వచ్చినవాడిని. నాకింకా ప్రాబ్లెమ్సు ఉంటాయిగాని, నీకేం ఉంటాయి?"

"అలా అనకు. అన్నీ చెప్తా. ముందు మాధవిని పంపించెయ్యనీ" అంటూ అక్కడకొచ్చిన పని మనిషితో "రేపు ప్రొద్దున తొందరగారా. మర్చిపోయా, వుండు. మధ్య హాల్లో రెండు మంచాలు, పక్కలు వేసి పెడుదువుగాని" అని ఆమెను లోపలికి తీసుకెళ్ళింది.

వేణు తెల్లబోతూ కూర్చున్నాడు. ఊహించని పరిస్థితి! బి.ఎ. చదివే రోజుల్లో అప్పుడప్పుడు వాళ్ళింట్లో, వాళ్ళ అన్నయ్య రఘుతో, క్లాసుమేటుగా, ముఖ్య స్నేహితుడుగా, రాత్రిళ్ళు కూడా కబుర్లతో గడిపేవాడు. అప్పుడు సైన్సు క్లాసు చదివే లీల కూడా వాళ్ళ దగ్గరకు చేరి, ఆరిందాగా కబుర్లలో కల్పించుకుంటూ, కొన్నిసార్లు చిన్న పిల్లగా చివాట్లు తింటూ ఉండేది. అంత సాన్నిహిత్యం అప్పుడు వున్నా, యిప్పుడు ఆమెతో వంటరిగా గడపటమంటే, డెలికసీ ఫీలయ్యాడు.

మాధవిని పంపి, లీల, వేణుకెదురుగా యింకో సోఫాలో కూలబడి, అమ్మయ్య అనుకుంది.

ఇక వెళ్ళనివ్వదని నిర్ధారణ అయినా, 'నా రైలు' అన్నాడు వేణు, చనువున్నగారాబపు గొంతుతో.

"దాని దారిని అది వెడుతుందిలే కాని, ముందుర నాకు చెప్పు. అరుణ, నువ్వు, ప్రాణానికి ప్రాణంగా ప్రేమించుకొనేవారట. మరెందుకు చెరో దారి పట్టారు? "లీల సీరియస్‌గానే అడిగింది, వైద్య వృత్తిలో ఉన్న హుందాతనంతో.

"ఇది తెలుసుకోవటానికా వుండమన్నావు" వేణు నవ్వాడు.

"ఇదే కాదు. ఇంకా వున్నాయి. బి.ఎ. ఫస్టుక్లాసులో ప్యాసవ్వాల్సిన వాడివి, అందరు ఆశ్చర్యపోయ్యేట్టు తప్పి కూర్చున్నావు. అరుణపిచ్చే కారణం అనుకున్నాం మరి"

వేణు కలత చెందాడు కాని బయటపడకూడదని", అదేం కాదు. నా ప్రారబ్ధంలే! చిన్నప్పుడో జ్యోతిష్యుడు నా జాతకం చూసి మా నాన్నగారితో, నాకు విద్యావిఘ్నమనేదే వుండదు. అన్నిటిలో సుబ్రిలియంటుగా వుంటానని చెప్పటం విన్నా. అట్లాగే ఇంటరు వరకు మంచి మార్కులు, డిస్టింక్షన్‌లతో చదువులోను, ఆటపాటల్లో చాలా చురుకుగా వుండేవాడిని. దాంతో గర్వం వచ్చింది. బి.ఎ.లో గేమ్సు, నాటకాలు, కొన్ని అసోసియేషన్స్‌లో ప్రెసిడెంటుగా, సెక్రటరీగా యాక్టివిటీసు, కథలు వ్రాయటం వగైరాలతో చదువెక్కడ సాగుతుంది. కెమిస్ట్రీ మెయిన్ సబ్జెక్టు, చదివినా బుర్రకెక్కకుండా ఆవిరై పోయేది. తప్పానంటే తప్పనా మరి!" అన్నాడు.

"అవికాక నువ్వు మాగజైను ఎడిటరుగా, ఆవిడగారు గరల్సురి ప్రజంటేటివుగా వకరి పట్ల వకరు ఆకర్షితులై, చర్చల వంకతో స్నేహాన్ని పొడిగించుకున్నారట ఆవిడ ధ్యాసే తప్పటానికి ముఖ్య కారణమట", అంది లీల, వేణు రీజనింగ్‌ను కొట్టిపారేస్తూ...

"అదే అనుకొని వదిలేద్దూ", అన్నాడు వేణు నిట్టూర్పుతో.

"అందుకు కాదు. విభేదాలు యెందుకు వచ్చాయని?"

వేణుటెన్షన్ ఫీలయ్యాడు. ఒకసారి ఊపిరి గట్టిగా పీల్చి వదిలేసి "కొన్ని జీవితాలు అంతే. ఇరవైయేళ్ళు పైగా గడిచాయి. ఇప్పుడెందుకు తప్పుకోటం?" కొద్ది విసుగు చూపాడు.

"నీ మనసు నొప్పిస్తే, క్షమించు. చెప్పద్దులే".

క్షమించటానికి, చెప్పకపోవటానికి యేముందిగాని, వో మహారాణి చెప్పిందట ఆమెకు, నేను, శీను రౌడీలమని, శీను స్నేహితురాల్ని యెవరో యిద్దరు కుర్రాళ్ళు టీజ్ చేస్తే, మేము ఓ అర్ధరాత్రి వాళ్ళ రూములోకెళ్ళి చావబాదామట! అది నమ్మి అరుణ, నాకు రౌడీ ముద్ర పడిందని కోపము, విచారము, రెండూ ప్రదర్శించి "చదువు అశ్రద్ధ చేస్తున్నావు, బాగా తెలివిగలవాడివాయి. చక్కగా చదివితే క్లాసు గ్యారంటీ. రిజల్ట్సు రాగానే మళ్ళీ నీతో మాట్లాడతా" అంటూ మాట్లాడటం మానేసింది.

శీనూకు అంత సన్నిహితురాలిగా స్నేహితురాలనేదే లేదు, యిక దెబ్బలాటలెక్కడ? అంతా అనూయ వెధవలెవరో కల్పించారు" అని ఎంత చెప్పినా నమ్మనంటూ మొండికేసింది. అది మినహాయిస్తే చాలా మంచిది. ఆమెను తప్పు పట్టను. అంతా నా దురదృష్టం!"

"దురదృష్టమో, అదృష్టమో! సరేగాని, నీ భార్య సంగతి చెప్పు. ఆమెతో యెట్లా గడిచేది? అరుణ విరహం ఎఫెక్టు యేమన్నా ఉండేదా?" నడివయసు ప్రౌఢగా అడిగింది, యీ తడవ సరసధోరణిలో. తన ప్రేమాభిమానుల విషయాలు అడుగుతూ ఉంటే, సలహాలు కావాలని డిన్నరుకు పిలవటం, పంచభక్ష పరమాణ్ణాలలా అందులో అయిటమ్స్, కొసరి కొసరి వడ్డన, తాంబూలం యిచ్చి ప్రయాణం ఆపటం, అన్నీ బాంధవ్యపు కోరికతో పెట్టే పరీక్షగా భావిస్తూ వేణు నవ్వుకున్నాడు. తనలో యే చలనము లేనట్టు స్థిమితంగా కనిపించాలనుకున్నాడు. క్రితం రోజు చెప్పనే చెప్పాడు. తన భార్య సర్వ విధాల సహకరిస్తూ ఉండేదని. అయినా అవివాహిత జిజ్ఞాస అట్లా వుంటుందిగావును అని సరిపుచ్చుకుని, తను స్వేచ్ఛగాను, కొంచెం కొంటెగాను మాట్లాడటం మొదలెట్టాడు.

"తలిచే సందర్భం ఎప్పుడు వచ్చినా, అరుణ స్నేహం విఫలమవటం దురదృష్టంగా భావించేవాడిని, పద్మజతో దాంపత్యం నిత్యం అదృష్టంగా తలుస్తూ, ఆనందిస్తూ వుండేవాడిని!"

"సూక్ష్మంగా చెప్పానా? మళ్ళీ విపులంగా చెప్తావిను. నేను బి.ఎ. తప్పిమా ఊరు వెళ్ళటం. అరుణ ప్యాసై పై చదువుకు మద్రాసుకు వెళ్ళటం జరిగిన తర్వాత, నా స్థితి పూర్వాపరాల విశ్లేషణతో, నాలో ఆత్మన్యూనతా భావం ప్రవేశించింది. అరుణ తన భావాలకు, చొరవకు తగినట్టు, విద్యలో జీవితంలో పై అంతస్తులకు యెదగగలదని, నేను, ఆమెకు తగిన వాడిని కానని, ఆమెను మరచిపోవాలని ప్రయత్నిస్తూ, హిస్టరీకి గ్రూపు మార్చుకున్నా, కాస్త పట్టుదలతో చదువుతున్నా కూడా అరుణ గుర్తుకు వస్తూనే ఉండేది. అయినా పరీక్షలో బాగా వ్రాసి క్లాసు తెచ్చుకున్నా.

డిగ్రీ రాగానే మంచి ఉద్యోగం వస్తుందిలే, యీలోగా పెళ్ళి చేసుకో అని అయిన వాళ్ళందరు ఒత్తిడి చేస్తూ వుంటే, అదే మంచిదేమో నని, పెళ్ళి చూపులకు, నిజానికి నిర్లప్తంగానే వెళ్ళాను.

ఆకాశ నీలం వర్ణపు చీర, చంద్రబింబం లాంటి వదనం, స్వర్ణఛ్ఛాయ విగ్రహంతో ఆకట్టుకుంటూ పెళ్ళి కూతురు ప్రత్యక్షమయ్యింది. నా చిరునవ్వు ప్రసరించి, ఆమె నునుసిగ్గును పెనవేసుకొంది. టెన్తుక్లాసుతో ఆపిన చదువు, హిందీలో విశారద, వీణ వాయించటంలో దిట్ట. చూడగా, యేలోపం కనిపించలేదు.

"కవివైపోతున్నావే!" అంది లీల గట్టిగా నవ్వుతూ.

"కవిత్వం కాదు, నిజం. అంతేకాదు, పేపర్లలో ఆ సాయంత్రపు యెడిషన్స్‌లోనే మా రిజల్ట్సు. నేను సెకండు క్లాసులో ప్యాసవటం! ఉత్సాహంగా మర్నాడే గ్రీన్ సిగ్నల్ యిప్పించటం, తర్వాత కళ్యాణం కమనీయమవటం జరిగింది. అన్నయ్య పెళ్ళికి వచ్చాడుగా, చెప్పే వుండాలి."

"చెప్పాడుగాని, సర్లే. లోపలికెడదాం. కాస్త నడుం వాల్చి మాట్లాడుకోవచ్చు", అంటూ మధ్య హాల్లోకి దారితీసింది. రకరకాల ఆలోచనలతో, ఆమెననుసరించాడు వేణు.

మంచాలమీద పడుకున్న తర్వాత "ఆ! ఇక చెప్పు" అంది లీల.

"చెప్పటానికింకేం వుంది? కూతుర్ని కంది. ఏడేళ్ళు సంసార సామ్రాజ్యం చక్కగా యేలింది. కథ కంచికి పంపి, తను స్వర్గానికి వెళ్ళింది.!"

"ధర్మ పత్నికి నీ అంకిత భావం గొప్ప ఆనందాన్నిస్తోంది. ఎంతో అదృష్టవంతురాలు". అది నా విశ్వాసం కూడా! సరే నా ప్రాబ్లమ్స్ ఏవో చెప్పు".

"ముందర నీవి అవనీ, కలకత్తా వెళ్ళి కూతురు, అల్లుడు మనుమడుల దగ్గిర వుంటే సమస్య అనేదే వుండదుగా?"

"అక్కడే పొరబాటు పడ్డావు. ఓపికున్నంత కాలం, మనసు సలక్షణంగా పనిచేస్తున్నంతకాలం, మన స్వేచ్ఛ మనకుండాలి. వాళ్ళ దగ్గరకు వెళ్ళకూడదు, వెళ్ళి యిబ్బంది పెట్టకూడదు, పడకూడదు, ఒక పని వాడిని పెట్టుకుంటే, వంట పనులు, యింటి పనులు, అన్నీ చేస్తాడు. ఫ్రూట్సు, బిస్కట్లు, పిప్పరమెంట్సు వంటి వాటితో నోటి చాపల్యాలు సర్దుకోవచ్చు. దగ్గరలో వున్న స్నేహితులొకరిద్దరితో కాంటాక్టు బాగా వుంచుకుంటే, మంచి చెడ్డలు చూస్తూ వుంటారు. కోర్టు పనులవగానే సాయంత్రాల్లో కాలాక్షేపం కూడా మరణశయ్యమీదున్నప్పుడు, కూతురు కుటుంబంతో వచ్చి అంత్యక్రియలన్నీ చేయిస్తుంది. ప్రాబ్లెమ్ సాల్వయిందిలే"

అప్పుడే అంత వైరాగ్యం వద్దులే! నిజం చెప్పు. భార్య పోయింతర్వాత, అరుణ మళ్ళీ మళ్ళీ గుర్తుకు వస్తోంది?" నవ్వుతూనే అడిగింది.

"అదేం పిచ్చి ప్రశ్న? గుర్తురావటానికి భార్యపోవాలా? ఆలస్యంగా అయినా, అరుణ దర్జాగా



జయంతి పబ్లికేషన్స్-హైదరాబాద్'వారి సౌజన్యంతో 'గుంటూరు జిల్లా రచయితల సంఘం' ఆధ్వర్యంలో గుంటూరులో జరిగిన కార్యక్రమంలో 'డా॥ కె.ఆర్.కె. మోహన్ స్మారక సాహితీ పురస్కారం' స్వీకరిస్తున్న ప్రముఖ రచయిత శ్రీ కె.బి. కృష్ణ. చిత్రంలో పురస్కార ప్రదాతలు, 'జయంతి' సంస్థ అధినేతలు శ్రీమతి & శ్రీ యస్వీకృష్ణ - జయంతి, ప్రముఖ కవి కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, డా॥ భూసురపల్లి వెంకటేశ్వర్లు, 'ఆకాశవాణి-విజయవాడ' స్టేషన్ డైరెక్టర్ మంగళగిరి ఆధిత్యప్రసాద్, డా॥ పి.వి. సుబ్బారావు, డా॥ బీరం సుందరరావు ఉన్నారు.

పెళ్ళి చేసుకొని యిప్పుడు భర్తతో అమెరికాలో ఉందిటగా?"

"విడాకులిచ్చి వచ్చేసి రాజమండ్రిలో వుందిటలే. పిల్లాపీచు లేరు".

"అరే, పాపం! నీకు యెడ్రసు తెలుసా?"

"ఎందుకు"

"ఎప్పుడన్నా రాజమండ్రివెడితే, కలిసి వలకరించటానికి, ఎంతైనా, ఒకప్పుడు క్లాసుమేటేగా? సానుభూతి! అంతే"

"అంతేనా? పోన్లేనాకెందుగాని. రేపు అడ్రసు చెప్తా, మా ఫ్రెండునడిగి" అని నవ్వుతూ లేచివెళ్ళి, జీరో వాట్ ఆన్‌చేసి, ట్యూబ్‌లైట్ ఆఫ్ చేసి వచ్చింది.

"నీ చిన్నప్పటి అల్లరి యింకా పోలా! అరుణ సంగతి నువ్వే ఎత్తి, నా చేతవాగించావు చాలుగాని నీ సమస్యేమిటో చెప్పు" అన్నాడు నవ్వుతూ.

అల్లరి కాదు. నీ మీద జాలేసి, యెట్లా వున్నావో తెలుసుకున్నానన్న మాట. ఇకపోతే, నాదీ, నీ యిప్పటి పరిస్థితేగా! ఇక నువ్వుండాలను కుంటున్నట్లు నేనిప్పటికే వుంటున్నా".

"అదేమిటి? అన్నయ్య కుటుంబం ఆసరాగా వుండదా?"

"మర్చిపోయా, నిన్న చెప్పటం. వదినె, కూతురు దగ్గరికెళ్ళి బెంగుళూరులో వుంటోంది. అల్లుడక్కడ ఇంజనీరుగా సెటిలైపోయాడు మరి. ఆస్తి పంపిణీ క్రింద నాకీ మేడయిచ్చారు, వాళ్ళక్కడ మేడకొనుక్కుని, ఏదైనా అన్నయ్య ఉన్నప్పటి, లేనప్పటి తేడా వుంటుందిగా?"

"మీ మేనకోడలు కెంతమంది పిల్లలు?"

"నాలుగేళ్ళ కొడుకు, మూడేళ్ళ కూతురు. ఎందుకు"

"ఆ కూతుర్ని చదివించి పెళ్ళి చేస్తానని, మేడ రాసిస్తానని చెప్పి తెచ్చుకో, నీ దగ్గరుంచుకో. ఆపేక్షలు పెరుగుతాయి. బాగుంటుంది. ఇక నిద్రపో" అన్నాడు.

"ఆలోచనలతో నిద్ర రావటల్లా. ఆ పిల్లలను నీ మనవడికి యిచ్చి చేయిస్తాకూడా. నువ్వొచ్చి యిక్కడే లా ప్రాక్టీస్ చేసుకోకూడదు? నాకు అండగా వుంటావు', అంది జాలిగొలిపేట్టు.

ఇంతకుముందు నవ్వుతూనే తన మీద జాలివడుతున్నట్టు మాట్లాడింది. ఇప్పుడు జాలికోరుతోంది అని నవ్వుకున్నాడు వేణు. తనకిప్పుడు బాధ్యతలంటూ యేం లేవు. తన ప్రయాణం ఆవినప్పటినుండి లీల మీద ప్రేమాభిమానాలు ప్రణయబంధం కోరుతున్నాయి.

"నేనునిన్నర్థం చేసుకొన్నాలే. జనాన్ని నువ్వర్థం చేసుకోవాలి" అన్నాడు నవ్వుతూ పెద్దరికపు హెచ్చరికలా.

"ఆ సంగతే చెప్తావుండు. ఫ్లాస్కులోపాలున్నాయి. రాత్రి పూట పడుకునే ముందు పాలు తాగితే మంచి నిద్ర పడుతుందని అలవాటు చేసుకున్నా" అంటూ వెళ్ళి, నిండుగా పాలతో పెద్ద వెండిగ్లాసు తీసుకొచ్చింది.

"లేచి కూర్చుని విను" అంది

లేచి కూర్చున్నాడు, వేణు నవ్వుకుంటూ

"ప్రొఫెషన్ వల్ల జనాన్నెప్పుడో అర్థం చేసుకున్నా. గుదులెన్నో వున్నాయి. హిందూ వివాహ చట్టం వుంది. మనిద్దరి స్నేహితులు వున్నారు. పాలు నువ్వు కూడా తాగు", అంటూ వేణు నోటి దగ్గర గ్లాసు పెడుతుంటే.

"తొలి రాత్రి చేస్తున్నావే", అని నవ్వి తాగటం మొదలెట్టాడు, వేణు. "అన్నీ నువు తాగటానికి కాదు. పాలు పంచుకుందాం, అన్నిట్లో కూడా" అంటూ, సగం పాలుండగానే గ్లాసు అందుకుంది, వేణు సహకరిస్తుంటే.

# మనం మనంగా పరివ్యాప్తమవుదాం!

ఇంట్లో కన్నీళ్లు
ఇస్త్రీ మడతల్లో దాచుకొని
అబద్ధపు ముఖాన్ని
అద్దంముందు అసలు ముఖంగా
మేకప్ చేసుకుంటూ
కలహం కత్తుల్ని
కుత్తుకలో దాపెట్టుకొని
అరువు చిరునవ్వును
పెదవులపై అంటించుకొని
వినోదపు విందుల్లో
చిందులేస్తుంటాం!
మత్తుకు అత్తుకొని
స్పృహ తప్పడమే
సంతోషంగా
కవితలు వ్యాకులతలు
కప్పెట్టే హిస్టీరియా వినోదమే
ఆనందంగా
నటనే జీవితంగా
నెట్టుకు పోతుంటాం!
అనాగరికమో! నాగరికమో!
మానసికానందమో! రుగ్మతో!
తెలియని వ్యామోహం వెంటాడుతుంటే
పచ్చనోట్ల వైరస్‌సోకి పచ్చ కామెర్లు ముదిరిన
ప్రేమ రహిత సమాజంలో
దోపిడీని మరుగుపరచే
ధార్మిక స్వచ్ఛందసేవా సమస్థలమైపోతుంటాం!
హృదయం లేని సంగీతం
అంతరంగ పరిచయం లేని ఆలాపనలు
పదవి, ఆర్థికాపేక్ష, స్వార్థం
పడగవిప్పి నర్తిస్తూన్న
రాజకీయ, సామాజిక కూటాల్లోకి
మనం ప్రమేయ రహితంగానే నెట్టబడుతుంటాం!
దొర్లిపోతున్న జీవితం
పెడదార్లో అనేకానేక సమస్యల దాడుల్లో
గాయాలవుతున్నా...
పరిష్కారాన్వేషణకు ప్రాణవాయువందక
మరణిస్తున్నా...
తిరిగి జన్మించడం చేతగాక అంగలార్చుతూ...
అస్తిత్వం కోల్పోయాక
మనలో మనమే మానవబాంబులం కాకముందే
సమాజం మందుపాతరై పేలకముందే
పరితప్త హృదయాల్లో
ప్రేమజ్యోతిని వెలిగించుకుంటూ
మనం మనంగా పరివ్యాప్తమవుదాం!!

-కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి